# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక


మెదక్ | సంపుటి: 18 సంచిక: 342 | శనివారం, 09 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV
www.MHRtv.com


## ఓటు హక్కుపై మీరు దాడి చేస్తే...
# మీపై మేం దాడి చేస్తాం



ఈసీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఫైర్
'ఒక వ్యక్తి, ఒక ఓటు' హక్కుపై దాడి చేస్తే ఊరుకోమని హెచ్చరిక
లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసానికి పాల్పడ్డాయని ఆరోపణ
ఒక్క బెంగళూరులోనే 1.25 లక్షల ఓట్లను దొంగిలించారని సంచలన వ్యాఖ్యలు
ఐదు పద్ధతుల్లో ఓట్ల ఫ్రాడ్ జరిగిందని వివరించిన రాహుల్ గాంధీ
దేశవ్యాప్త ఓటర్ల జాబితా, వీడియోలు విడుదల చేయాలని డిమాండ్

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

భారత రాజ్యాంగం ప్రసాదించిన 'ఒక వ్యక్తి, ఒక ఓటు' హక్కుపై దాడి చేస్తే, ఎన్నికల కమిషన్ (ఈసీ)పై తాము కూడా దాడి చేస్తామని, కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవా రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో నిర్వహించిన నిరసన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇది కేవలం తన గొంతు కాదని, యావత్ హిందుస్థాన్ గొంతుక అని స్పష్టం చేశారు. ఎన్నికల మోసం ఫిర్యాదుపై తన నుంచి అఫిడవిట్ కోరారని, కానీ తాను ఇప్పటికే లోక్‌సభలో రాజ్యాంగంపై ప్రమాణం చేశానని రాహుల్ గుర్తుచేశారు. "రాజ్యాంగ మౌలిక సూత్రం 'ఒక వ్యక్తి, ఒక ఓటు'. ఈసీ అధికారులు దానిపైనే దాడి చేస్తున్నారు. అంటే మీరు పేదలపై దాడి చేస్తున్నారు. ఎన్నికల్లో మోసం చేసి సులభంగా తప్పించుకోవచ్చని అనుకుంటే పొరపాటే. సమయం పట్టొచ్చు, కానీ మిమ్మల్ని ఒక్కొక్కరిగా పట్టుకుంటాం" అని రాహుల్ హెచ్చరించారు. బెంగళూరు సెంట్రల్

మిగతా 2లో..



# వరదనీటి సమస్యకు చెక్

కోర్ అర్బన్ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారంపై దృష్టి
నగర నాలాలు, చెరువులను మూసీకి అనుసంధానం చేయాలి
మూసీ పునరుజ్జీవనమే వరదలకు శాశ్వత పరిష్కారం
హైదరాబాద్ వర్షాలపై సీఎం రేవంత్ అత్యవసర సమీక్ష

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

వర్షాలు పడిన ప్రతీసారీ హైదరాబాద్ వాసులు ఎదుర్కొంటున్న నీటి చేరిక, ట్రాఫిక్ జాం, లోతట్టు ప్రాంతాల్లో వరద వంటి సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సీరియస్‌గా స్పందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల తరువాత నగరంలో ఏర్పడిన అతలాకుతల పరిస్థితులపై ఆయన సమీక్ష నిర్వహించారు. సమీక్షలో సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర చర్చ జరిపారు. నిన్న రాత్రి కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి నిలిచిపోవడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటి అంశాలపై సీఎం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రతిసారీ చర్యలు చేపట్టడం కాకుండా శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న కోర్ అర్బన్ ప్రాంతాల్లో వరదనీటి సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, సీఎం శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద నీరు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా సాంకేతిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతి చెరువు, నాలా, కాలువలన్నింటినీ మూసీ నదికి అనుసంధానం చేయాలన్నది ముఖ్యమంత్రిగారి

మిగతా 2లో..




## హత్య చేసింది ఎవరు?

హత్య చేయాల్సిన అవసరం ఎవరికి వచ్చింది?
దోపిడీ దొంగల పనా?
ఆస్తి తగాదాలు ఏమీ లేవంటున్న కుటుంబ సభ్యులు
మిస్టరీని తలపిస్తున్న జంట హత్యలు

02

## మత్తుకు బానిసలైన మెడికోలు



రూ. 50 వేల విలువైన 2 కేజీల గంజాయి స్వాధీనం
యువకుడి మొబైల్ తనిఖీ చేయగా సంచలన విషయాలు
యువకుడిని అర్ఫత్ అహ్మద్ ఖాన్‌గా గుర్తింపు
అహ్మద్ ఖాన్ లిస్ట్‌లో 84 మంది గంజాయి కన్జూమర్లు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

వాళ్లంతా మెడికోలు...!! మూడు నాలుగేళ్లలో బయటకొచ్చి డాక్టర్లుగా మారి వైద్యం అందించాల్సిన వాళ్లు !! కానీ.. అడ్డదారులు తొక్కారు. స్టెత్ పట్టాల్సిన చేతితో గంజాయి పట్టారు. మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును చేతులారా చిత్తు చేసుకుంటున్నారు. ఓ డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకుని తీగ లాగితే మెడికోల డొంక కదిలింది. ఇద్దరో ముగ్గురో కాదు... ఏకంగా ఒక్క కాలేజ్‌కి చెందిన 100 మంది మెడికోలు గంజాయి కన్‌జూమర్లుగా మారారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీళ్లందరికీ గంజాయి సప్లై

మిగతా 2లో..

## వదల బొమ్మాళి.. వదల

తెలంగాణను వదలనంటున్న వరణుడు
బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి
మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు?

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే, నేడు ఈ ద్రోణి మరింత బలపడడంతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. గురువారం మధ్యాహ్నం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అనేక

మిగతా 2లో..





## నీ చీకటి రహస్యాలు బయటపడతాయి

లీగల్ నోటీసుల గురించి ట్విట్టర్ టిల్లు మాట్లాడడం సిగ్గుచేటు
ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ చెల్లెలు వ్యాఖ్యలపై సంచలనం
కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర రాజకీయ విమర్శలు

02



02

## 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలి

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో ఒక్క శాతం నిజమైతే నిరూపించండి
నిఘా వ్యవస్థపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కనీస అవగాహన లేదు
బజారు భాష, చౌకబారు ఆరోపణలపై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

## బీజేపీలో చేరుతున్న..

బీఆర్‌ఎస్‌కు గుడ్ బై చెప్పిన గువ్వల బాలరాజు
ఆదివారం ఉదయం 10 గంటలకు బీజేపీలో అధికారికంగా చేరిక
బీజేపీ విధానాలపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్నానన్న మాజీ ఎమ్మెల్యే
నల్లమల్ల ప్రాంతంలో బీజేపీకి జెండా ఎగురవేస్తానని హామీ



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీ మారుతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఆయన వచ్చే ఆదివారం (10వ తేదీ) ఉదయం 10 గంటలకు బీజేపీ పార్టీని చేరనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన బాలరాజు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, నేను ఎంతో కష్టపడి బీఆర్‌ఎస్ పార్టీ జెండాను చెట్టు కు, పుట్టకు, ఇంటికి తీసుకెళ్లాను. అదే తీరులో ఇప్పుడు బీజేపీ జెండాను కూడా ఇంటింటికి తీసుకెళ్తాను" అన్నారు. కాంగ్రెస్,

మిగతా 2లో..

## చెన్నమనేని కేసులో ఆది శ్రీనివాస్‌కు ఎదురుదెబ్బ



కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
రమేశ్ పదవీకాలం ముగిసినందున జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టీకరణ
హైకోర్టు తీర్పునే సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం
గత పర్యాయాల్లో తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలన్న శ్రీనివాస్ వాదనకు నిరాశ
పదిహేనేళ్లుగా నడుస్తున్న వివాదానికి ముగింపు పలికిన తాజా తీర్పు

**రాజన్న సిరిసిల్ల, ప్రజాస్వరం :**

వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి పదిహేనేళ్లుగా కొనసాగుతున్న పౌరసత్వ వివాదానికి సుప్రీంకోర్టు శుక్రవారం ముగింపు పలికింది. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రమేశ్ పోటీ చేసిన ఎన్నికల పదవీకాలం ఇప్పటికే ముగిసిపోయినందున, ఆ విషయాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్

మిగతా 2లో..



## 'సృష్టి' ఫెర్టిలిటీ కేసులో కలకలం

మరో ఇద్దరి వైద్యుల అరెస్టు
కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతం

02

# మత్తుకు బానిసలైన మెడికోలు

మొదటిపేజీరతరువాయి

చేస్తుంది కూడా అక్షరం ముక్క రాని ఓ లేడీ డాన్. పోలీసుల రెగ్యులర్ తనిఖీల్లో.. అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ యువకుడిని గుర్తించారు. బైక్‌ను ఆపి తనిఖీ చేయగా.. గంజాయి లభ్యమైంది. 50 వేల రూపాయల విలువైన 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడింది 2 కేజీలే కావడంతో.. చోటామోటా పెడ్లర్‌గా భావించారు పోలీసులు. కానీ.. యువకుడి మొబైల్ తనిఖీ చేయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పట్టుబడ్డ 23 ఏళ్ల యువకుడిని అర్ఫత్ అహ్మద్ ఖాన్‌గా గుర్తించారు. యువకుడిది సికింద్రాబాద్ పరిధిలోని రిసాలా బజార్. అహ్మద్ ఖాన్ లిస్ట్‌లో ఏకంగా 84మంది గంజాయి కన్జూమర్లుగా ఉన్నట్లుగా ఆధారాలు సేకరించారు పోలీసులు. కన్జూమర్ల లిస్ట్‌ను బట్టి వివరాలు సేకరించగా పోలీసులకు ఊహించని షాక్ తగిలింది. 84 మంది కన్జూమర్ల లిస్ట్‌లో ఏకంగా 26 మంది మెడికోలు ఉన్నట్లు గుర్తించారు. ట్విస్ట్ ఏంటంటే...ఈ 26మందీ మేడ్చల్ పరిధిలోని మెడిసిటీ కాలేజ్‌కి చెందిన మెడికో స్టూడెంట్సే !! ఈగల్ టీమ్ నేరుగా మెడిసిటీ కాలేజ్‌కి చేరుకుని 26 మంది విద్యార్థులకు గుర్తించి గంజాయి టెస్ట్‌లు చేసింది. ఇందులో



9 మందికి గంజాయి పాజిటివ్‌గా వచ్చింది. నెగిటివ్‌గా వచ్చిన వాళ్లంతా సుద్దపూసలేం కాదు... టెస్ట్ చేసే సమయానికి నెగిటివ్‌గా వచ్చింది అంతే !! కొన్ని రోజుల ముందు వరకు గంజాయి తీసుకుని ఉండరు అంతే.. అర్ఫత్ నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న విద్యార్థుల నుంచి మరింత సమాచారం సేకరించింది ఈగల్ టీమ్. గత మూడేళ్లుగా అర్ఫత్ నుంచి ఏకంగా 100 మందికి పైగా విద్యార్థులు గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో.. ఈ విద్యార్థుల తల్లిదండ్రులను కూడా కాలేజ్‌కి పిలిపించి.. కౌన్సిలింగ్ ఇచ్చారు పోలీసులు. గంజాయి పెడ్లర్లపైనే కాదు.. కన్జూమర్లపైనా ఎన్‌డీపీఎస్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. కేవలం మెడికో స్టూడెంట్స్‌నే టార్గెట్‌గా చేసుకుని అర్ఫత్ గంజాయి అమ్ముతున్నారు. కాలేజ్‌లో కూడా సీనియర్లు... జూనియర్ స్టూడెంట్స్‌కు బలవంతంగా గంజాయి అలవాటు చేస్తున్నారు. మెల్లమెల్లగా జూనియర్ అడిక్ట్ ఐన తర్వాత.. అర్ఫత్ కాంటాక్ట్ ఇచ్చి.. తమకు కూడా జూనియర్ డబ్బుల ద్వారానే గంజాయి తెప్పించుకుంటున్నారు సీనియర్లు. అర్ఫత్ ఖాన్‌కు గంజాయి ఎక్కడి నుంచి వస్తుందనే కూపీ లాగింది ఈగల్ టీం. బీదర్‌కి చెందిన జరీనా ఖాన్ నుంచి అర్ఫత్ గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు. జరీనా ఖాన్‌కు అర్ఫత్ లాంటి పెడ్లర్లు సిటీ వ్యాప్తంగా 50 మంది పైనే ఉంటారని సమాచారం. ఏమాత్రం చదువుకోని పూర్తి నిరుద్యోగురాలుగా ఉన్న జరీనా ఏకంగా కూర్చున్న చోట నుంచే గంజాయి నెట్‌వర్క్ ఆపరేట్ చేస్తోంది. బీదర్ నుంచి బల్క్‌లో గంజాయి కొంటున్న జరీనా.. వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి.. హైదరాబాద్‌లోని పెడ్లర్లకు చేరవేస్తుంది. ఇలా ఏడాదిలో ఏకంగా కోటి నుంచి కోటిన్నర సంపాదిస్తోంది జరీనా. జరీనా బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన పోలీసులు... జరీనాకు చెందిన పలు అకౌంట్లలో పెద్ద ఎత్తున్న డబ్బు ఉన్నట్టు గుర్తించారు. వాటి గుట్టు విప్పుతున్నారు పోలీసులు. జరీనా భర్త కూడా పలు క్రైమ్‌లలో ఇరుక్కుని జైలు జీవితం అనుభవించి ఇటీవలే బయటకు వచ్చాడని తెలుస్తోంది. గంజాయి దందా ద్వారా ఏడాదికి కోటి నుంచి కోటిన్నర టార్గెట్ పెట్టుకుని మరీ జరీనా దందా చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు.

# నీ చీకటి రహస్యాలు బయటపడతాయి

- **లీగల్ నోటీసుల గురించి ట్విట్టర్ టిల్లు మాట్లాడడం సిగ్గుచేటు**
- **ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ చెల్లెలు వ్యాఖ్యలపై సంచలనం**
- **కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర రాజకీయ విమర్శలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఫోన్ ట్యాపింగ్ వివాదం నేపథ్యంలో తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా, ముఖ్యంగా ఎక్స్ (మునుపటి ట్విట్టర్)లో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ బండి సంజయ్, "ట్విట్టర్ టిల్లు.. నువ్వు చేసిన అక్రమాలను మర్చిపోయి లీగల్ నోటీసుల గురించి మాట్లాడడం సిగ్గుచేటు" అంటూ వ్యాఖ్యానించారు. లీగల్ నోటీసుల వెనక దాక్కుంటూ మాట్లాడే నీలో ధైర్యం లేదని, గతంలో కూడా ఇదే ప్రయత్నం చేసి



విఫలమయ్యావని సంజయ్ విమర్శించారు. "నీ చిల్లర చేష్టలకు నేను భయపడను. ధైర్యం ఉంటే ముఖాముఖి రా" అంటూ ఆయన సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని, రాఖీ పండుగ నేపథ్యంలో కేటీఆర్ సొంత చెల్లెలు భయంతో పారిపోతుందని సంజయ్ ఆరోపించారు. "ఆమె స్వయంగా ఫోన్ ట్యాపింగ్‌ను అంగీకరించిందని" ఆయన సంచలన వ్యాఖ్య చేశారు. "48 గంటలు గడువు అంటున్నావ్ కానీ, నీ సమయం సమీపించింది. నీ చీకటి రహస్యాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. నీకు దాక్కోవడానికి ఎటూ చోటు ఉండదు" అని బండి సంజయ్ హెచ్చరించారు. ఇంతటితో ఆగకుండా, "నీ అక్రమాలను సమర్థించుకోవడం ఎంత సులభమో, బీజేపీ నాయకులను బతిమాలి పార్టీ విలీనం చేయడం, లేదా ముఖ్యమంత్రి కావడానికి ప్రధానమంత్రిని కోరడం కూడా అంతే సులభంగా జరిగేదై ఉండేది" అంటూ బండి సంజయ్ తీవ్రమైన రాజకీయ విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కాయి. రెండు పెద్ద పార్టీల నేతల మధ్య విమర్శల యుద్ధం పచ్చి రాజకీయంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ అంశం ఎంతదాకా వెళ్లనుంది? లీగల్ నోటీసులు ఏమవుతాయి? అనే అంశాలపై రాజకీయ పరిశీలకులు ఆసక్తిగా చూస్తున్నారు.

# ఓటు హక్కుపై మీరు దాడి చేస్తే... మీపై మేం దాడి చేస్తాం

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గంలోని కేవలం ఒక్క మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌పై తాము దృష్టి సారించామని, అక్కడే బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసానికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. "మహాదేవపురలో మొత్తం 6.5 లక్షల ఓటర్లు ఉంటే, అందులో 1.25 లక్షల ఓట్లను దొంగిలించారు. అంటే ప్రతి ఆరుగురిలో ఒక ఓటును తారుమారు చేశారు" అని ఆయన వివరించారు.

**ఈ మోసం ఐదు ప్రధాన పద్ధతుల్లో జరిగిందని రాహుల్ ఆరోపించారు.**

1. సుమారు 12,000 మంది నకిలీ ఓటర్లు ఐదారు పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారు.
2. దాదాపు 40,000 ఓట్లను నకిలీ ఐడీలతో నమోదు చేశారు.
3. ఒకే ఇంటి చిరునామాపై వందల ఓట్లు నమోదు చేశారు. ఒక బీజేపీ నేత ఇంట్లో 40 మంది ఓటర్లు ఉన్నట్లు చూపగా, తాము వెళ్లి చూస్తే అక్కడ ఎవరూ లేరని తెలిపారు.
4. దాదాపు 4,000 మంది ఓటర్లకు ఫొటోలు లేవని, ఉన్నా అవి అస్పష్టంగా ఉన్నాయని చెప్పారు.
5. ఫారం 6 ద్వారా కొత్తగా చేర్చిన 34,000 ఓట్లలో చాలా మంది 89 నుంచి 95 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

ఎన్నికల కమిషన్ రాజ్యాంగం కోసం పనిచేయాలి కానీ, బీజేపీ కోసం కాదని రాహుల్ గాంధీ హితవు పలికారు. దేశవ్యాప్త ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, పోలింగ్ వీడియో రికార్డింగ్‌లను విడుదల చేస్తే, ఈ మోసం కేవలం కర్ణాటకకే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా జరిగిందని నిరూపిస్తామని ఆయన సవాల్ విసిరారు. ఈ పోరాటంలో తాను ఒంటరి కాదని, దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఇదే ప్రశ్నను లేవనెత్తుతున్నాయని, ఈసీ వెంటనే డేటాను విడుదల చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు.

# 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలి

- **ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో ఒక్క శాతం నిజమైతే నిరూపించండి**
- **నిఘా వ్యవస్థపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కనీస అవగాహన లేదు**
- **బజారు భాష, చౌకబారు ఆరోపణలపై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై తెలంగాణలో రాజకీయ వేడి మరింతగా పెరుగుతోంది. బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఆయన బండి సంజయ్‌కు లీగల్ నోటీసు జారీ చేస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల్లోగా క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. కేటీఆర్ వ్యాఖ్యల్లో బండి సంజయ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఫోన్ ట్యాపింగ్ విషయంలో బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉందని నిరూపించాలి. కేంద్ర మంత్రిగా ఉండి కూడా నిఘా వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో తెలియదు. కనీస అవగాహన లేకుండా చిల్లర ఆరోపణలు చేయడం ఆయన అలవాటుగా మార్చుకున్నారు," అని మండిపడ్డారు. "ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు, ప్రకటించిన అబద్ధాలు అన్ని హద్దులు దాటాయి. బజారు మాటలు మాట్లాడే బానిసపు శైలి ఆయనకు బాగా అలవాటు అయింది. బాధ్యత కలిగిన కేంద్ర మంత్రిగా వ్యవహరించడం అనేది ఢిల్లీ బాస్ చెప్పులు మూసే పని కాదు. బండి సంజయ్ ఇప్పటికైనా ఇది తెలుసుకోవాలి," అంటూ కేటీఆర్ చురకలంటించారు. కేటీఆర్ ప్రకటనల నేపథ్యంలో బీజేపీ ఎలా స్పందిస్తుందో, బండి సంజయ్ తక్షణమే క్షమాపణ చెబుతారో లేక ఇది కోర్టుల వరకూ వెళుతుందో చూడాలి. తాజా పరిణామాలతో తెలంగాణ రాజకీయాలు మరోసారి ఉత్కంఠత నెలకొన్నాయి.



# చెన్నమనేని కేసులో ఆది శ్రీనివాస్‌కు ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి

ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఆది శ్రీనివాస్ తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, రమేశ్ దేశాన్ని మోసం చేసినట్లు హైకోర్టు గుర్తించినప్పటికీ ఆయన ఇప్పటికీ పింఛనుతో సహా ఇతర శాసనసభ ప్రయోజనాలను పొందుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, సుప్రీంకోర్టు ఈ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు.

**వివాద నేపథ్యం ఇదే...**

చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరసత్వం కలిగి ఉండి, ఆ విషయాన్ని దాచిపెట్టి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ ఆది శ్రీనివాస్ 2019లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, నిబంధనలు పాటించలేదన్న కారణంతో 2019 నవంబరులో రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ రమేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2024 నవంబర్ 6న కీలక తీర్పు వెలువరించింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని నిర్ధారిస్తూ, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయడానికి, ప్రజా పదవులు చేపట్టడానికి అనర్హుడిగా ప్రకటించింది. 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు రూ. 30 లక్షల జరిమానా కూడా విధించింది. ఇందులో రూ. 25 లక్షలు ఆది శ్రీనివాస్‌కు, రూ. 5 లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించగా, రమేశ్ ఆ మొత్తాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో చెల్లించారు. 2009 నుంచి 2018 వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ రమేశ్ గెలుపొందగా, ఆది శ్రీనివాస్ రెండో స్థానంలో నిలిచారు. రమేశ్‌ను అనర్హుడిగా ప్రకటించినందున, ఆ పదవీకాలాలకు తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని శ్రీనివాస్ కోరారు. అయితే హైకోర్టు దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆయన అభ్యర్థనను తిరస్కరించడంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. కాగా, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ రమేశ్‌కు టికెట్ నిరాకరించగా, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆది శ్రీనివాస్ విజయం సాధించారు.

# హత్య చేసింది ఎవరు?

- **హత్య చేయాల్సిన అవసరం ఎవరికి వచ్చింది?**
- **దోపిడీ దొంగల పనా?**
- **ఆస్తి తగాదాలు ఏమీ లేవంటున్న కుటుంబ సభ్యులు**
- **మిస్టరీని తలపిస్తున్న జంట హత్యలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జనగామ జిల్లాలో దారుణం జరిగింది. తల్లీకూతుర్లు దారుణ హత్యకు గురయ్యారు. 80 ఏళ్ల వృద్ధురాలు అని కూడా చూడకుండా చంపేశారు దుండగులు. ప్రస్తుతం తల్లీ కూతుళ్ల హత్యకు గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జనగాం జిల్లా జాఫర్ ఘడ్ మండలం తమ్మడపల్లిలో గాలి రాణి.. తన తల్లి తుమ్మ అన్నమ్మతో కలిసి ఉంటోంది. అక్కడే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఐతే ఈ తల్లీ కూతుళ్లు దారుణ హత్యకు గురయ్యారు. 80 ఏళ్ల వృద్ధురాలిని దుండగులు ఇంట్లోనే చంపేశారు. ఆ తర్వాత ఆమె కూతురు రాణిని ఆరుబయట హత్య చేసి పారిపోయారు. జనగాం జిల్లా జాఫర్ ఘడ్ మండలం తమ్మడపల్లిలో ఉంటున్నరాణి.. భర్త జాజిరెడ్డి మృతి తర్వాత 80 ఏళ్ల తల్లితో కలిసి నివాసం ఉంటుంది. రాణి కూతురు కవితకు పెళ్లయింది. ఆమె విజయవాడ దగ్గర ఉంటోంది. ఇక రాణి ఇంట్లో పని చేసేందుకు పనిమనిషి వచ్చి తలుపు తెరవగానే అన్నమ్మ రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఒక్కసారిగా భయాందోళనకు గురైన పనిమనిషి జెన్నిక.. విషయాన్ని స్థానికులకు తెలిపింది. అదే సమయంలో ఇంటి ఆరుబయట రాణి తలపై బలంగా కొట్టి ఆమెపై బెడ్ షీట్ కప్పి ఉంచారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జంట హత్యలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డాగ్స్ స్క్వాడ్‌తో పరిసర ప్రాంతాలని పరిశీలించారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. రాణి కూతురు కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు... ప్రశాంతంగా ఉండే పల్లెలో తల్లీ కూతుళ్ల జంట హత్యలు కలకలం రేపాయి. ఎవరితో ఎలాంటి విభేదాలు లేని 80 ఏళ్ల వృద్ధురాలు, 60 ఏళ్ల పైబడిన మహిళను హత్య చేసింది ఎవరు? హత్య చేయాల్సిన అవసరం ఎవరికి వచ్చింది? దోపిడి దొంగల పని అనుకుందామన్నా వారి బంగారం వారి దగ్గరే ఉంది. ఆస్తుల తగదాలు ఏమీ లేవంటున్నారు కుటుంబ సభ్యులు. దీంతో ఈ జంట హత్యలు మిస్టరీని తలపిస్తున్నాయి.






# వరదనీటి సమస్యకు చెక్

మొదటిపేజీ తరువాయి

కీలక ఆదేశం. చెరువులను పునరుద్ధరించాలి, నాలాల వెడల్పు ప్రక్రియ వేగవంతం చేయాలి. నగరంలో వర్షం పడితే నీరు తక్షణమే చెరువుల్లోకి, ఆపై నాలాల ద్వారా మూసీకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంగా చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి వరద సమస్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనమే మార్గమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇది ట్రాఫిక్ సమస్యను కూడా అదుపు చేస్తుందని పేర్కొన్నారు. ఈ దిశగా నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# బీజేపీలో చేరుతున్న..

మొదటిపేజీ తరువాయి



బీజేపీ నేతలతో చర్చలు జరిపిన అనంతరం అన్ని కోణాలనూ పరిశీలించిన తర్వాతే బీజేపీలో చేరాలన్న నిర్ణయానికి వచ్చానన్నారు. బీజేపీ మంచి విధానాలతో ముందుకు సాగుతుండటమే తనను ఆకర్షించిన ముఖ్య కారణమని వెల్లడించారు. "ఎవరెన్ని మీటింగ్‌లు పెట్టుకున్నా నాకు పోయేది ఏమీ లేదు. నేను ఒక్కో ఇటుకలా నేనేదైతే నిర్మించానో, అదే స్థైర్యంతో ఇప్పుడు బీజేపీని బలోపేతం చేస్తాను. నల్లమల్ల ప్రాంతంలో కమలం జెండాను ఎగురవేస్తాను" అని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు.



# వదల బొమ్మాళి.. వదల..

మొదటిపేజీ తరువాయి

ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ అధికారులు నేడు, రేపు కూడా ఇదే వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని రంగారెడ్డి, మహబూబ్ నగర్, ఖమ్మం, మహబూబాబాద్, వనపర్తి, సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే మిగిలిన జిల్లాల్లో కూడా సాయంత్రం నుంచి రాత్రి వరకు ఓ మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. ఇకపోతే, గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. దీనితో హైదరాబాద్ జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. కొన్ని ప్రాంతాల్లో వరదలు తలపించేలా కుండపోత వర్షం పడింది. దీంతో రహదారులు చెరువుల్లా మారి, ఎక్కిడిక్కడ వాహనాలు నిలిచిపోవడంతో కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కానీ నేడు నగరంలో గురువారం నాటి దారుణ పరిస్థితులు ఉండకపోవచ్చని వాతావరణ శాఖ వెళ్ళడనిచ్చింది. చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉండి, సాయంత్రం నుంచి కొని ప్రాంతాలలో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది.



# 'సృష్టి' ఫెర్టిలిటీ కేసులో కలకలం

- **మరో ఇద్దరి వైద్యుల అరెస్టు**
- **కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

వైద్య వర్గాల్లో 'సృష్టి' ఫెర్టిలిటీ కేసు మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు వేగం పెంచింది. తాజాగా ఈ కేసులో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)కు చెందిన ఇద్దరు వైద్యులను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి కుమార్, ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి ఉన్నారు. ఇక వాసుపల్లి రవి కుమార్ మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కావడంతో ఈ కేసులో మరో రాజకీయ కోణాన్ని తీసుక రాబోతుంది. ఇదివరకు ఇదే కేసులో అరెస్టయి, బెయిల్ పై విడుదలైన డాక్టర్ విద్యుల్లత కూడా కేజీహెచ్ పిల్లల విభాగంలో పనిచేశారు. ఈ వైద్యులు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే 'సృష్టి' ఫెర్టిలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించే వారని ఆరోపణలు ఉన్నాయి. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఈ అరెస్టులపై తనకు వివరాలు తెలియవని తెలిపారు. డాక్టర్ వాసుపల్లి రవి కుమార్ గత మూడు రోజులుగా సెలవులో ఉన్నట్లు సమాచారం. ఇక మరో వైపు, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య 28కి చేరింది. దర్యాప్తులో బయటపడ్డ వివరాల ప్రకారం, సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత ఇప్పటి వరకు సుమారు 50 మంది బాధితుల వద్ద నుంచి రూ.20 కోట్లకు పైగా వసూలు చేశారు. మరో కీలక నిందితురాలు సంతోషి ఏజెంట్ల ద్వారా 18 మంది శిశువులను సేకరించినట్లు తేలింది. ముఖ్యంగా గిరిజన మహిళలను ప్రలోభపెట్టి వారి నుంచి శిశువులను రూ.5 లక్షలకు కొనుగోలు చేసి, తమ క్లయింట్లకు ఒక్కో శిశువును రూ.50 లక్షలకు విక్రయించినట్లు వెల్లడైంది. మొత్తం 80 మంది పిల్లలను అమ్మిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. తల్లులను గుర్తించి శిశువులను తిరిగి వారికి అప్పగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఎంపీ రఘునందన్ రావుకు మరోసారి బెదిరింపులు

**మెదక్ ఆగస్టు 08 (ప్రజా స్వరం) :**



మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు కు శుక్రవారం మరోసారి బెందిరింపు కాల్ వచ్చింది. హైదరాబాద్ లోనే ఉన్నాం, సాయంత్రం వరకు నిన్ను లేపేస్తాం, ఎవడు కాపాడుతాడో చూద్దాం అంటూ బెదిరింపులు దుండగులు ఆయనకు కాల్ లో మాట్లాడం జరిగింది. ఇప్పటికే ఐదు సార్లు ఎంపీ రఘునందన్ రావు కు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ బెదిరింపు కాల్ తో రఘునందన్ అనుచరులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు ఆందోళనలో ఉన్నారు.

## రైతు మహాధర్నా విజయవంతం

### మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

**మెదక్, ఆగస్టు 08 (ప్రజా స్వరం) :**



మెదక్ జిల్లా రైతు మహాధర్నా ను విజయవంతం చేసిన ప్రతి రైతు, బిఆర్ఎస్ శ్రేణులకు బీఅర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన మనస్ఫూర్తిగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మహా ధర్నాలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి లు పాల్గొనడం సంతోషకరమని అన్నారు. మెదక్ జిల్లా బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, జిల్లా రైతాంగానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ఎప్పుడైనా బిఆర్ఎస్ రైతుల పక్షాన అన్ని వర్గాల ప్రక్షాళన ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ మహాధర్న ఇంత భారీ విజయవంతం అవ్వడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు అందరూ ఈ రైతు మహాధర్నా సభకు హాజరై విజయవంతం చేసినందుకు వారికి కూడా మనస్ఫూర్తిగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమావేశం

**వికారాబాద్, ఆగస్టు 8(ప్రజా స్వరం ) :**



ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలకు బూతు స్థాయి ఏజెంట్లను తప్పని సరిగా నియమించాలని సూచించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ...పోలింగ్ కేంద్రాల్లో బూతు స్థాయి ఏజెంట్ల ప్రాధాన్యత ఎంతో అవసరమని, వంద శాతం ఏజెట్ల నియామకానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఏజెంట్ల నియామకం ఆగస్టు 14 లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకూడదనే నిబంధనల మేరకు ఎన్నిక కమిషన్ అనుమతి మేరకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలలో 1200 కు పైగా ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించి సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా ప్రజలకు చేరే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. 100 సంవత్సరాలు పూర్తయిన ఓటర్లను గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఏవైనా సందేహాలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలతో పాటు 4 నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాం రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.







## ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలు

**మెదక్ ఆగస్టు 08 (ప్రజా స్వరం):**

శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని మెదక్ పట్టణం కుమ్మరి గడ్డ కాలనీ లోని సంతోషి మాతా ఆలయంలో మహిళలు ఉదయం నుండి ఒడి బియ్యం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మి వ్రతం పూజలు దొర్బల రాజమౌళి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరలక్ష్మి వ్రతం పర్వదినం సామూహిక లక్ష పుష్పార్చన చేయడం జరిగిందని అన్నారు. దీపావళి రోజున ధనలక్ష్మిగా వరాలు ఇచ్చే రోజు వరలక్ష్మి గా అమ్మవారు దర్శనమిస్తుందని అన్నారు. నేడు అమ్మవారిని వరాలు ఇవ్వాలని వరలక్ష్మి వ్రతం చేయడం జరిగిందని అన్నారు.

## నిండిన చెరువుగంగమ్మకు పూజలు

**రామాయంపేట,(ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లారామాయంపేట మండల కోనాపూర్ గ్రామం లో వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు జల కల సంతరించుకున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాలలో చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది. కోనాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులోకి వరద నీరు చేరి అలుగు పారుతుంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధ రాములు, సాగర్ కోనాపూర్ చెరువు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులోకి నీరు చేరడంతో పంటలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో మామిడి సాగర్. సిద్ధ రాములు. నందు. మైపాల్ రెడ్డి. గడ్డం సురేష్. మామిడి సతీష్. రాజు తదితరులు పాల్గొన్నారు.



## వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

### గృహ నిర్మాణ శాఖ పిడి మాణిక్యం

**రామాయంపేట, (ప్రజా సర్వం) :**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామర్ చెరువు మోడల్ గ్రామాన్ని జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి మాణిక్యం సందర్శించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోడల్ విలేజ్ కు మొత్తం 90 మంది లబ్ధిదారులకు ఇల్లు పంపిణీ చేశామని, 40 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 38 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ బిల్లుల చెల్లింపు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 13 వందల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగంగా కొనసాగుతున్నట్టు తెలిపారు.

## బీసీ కాలనీలో ఎంపీడీవో పర్యటన

**రామాయంపేట, (ప్రజా సర్వం) :**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలోని బిసి కాలనీలో శుక్రవారం రామాయంపేట ఎంపీడీవో సజీలుద్దీన్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ మౌనిక, పంచాయతీ సిబ్బందితో కలిసి కాలనీలోని ఇంటింటా తిరిగి నిల్వ నీటిని పరిశీలించారు. ఎట్టి పరిస్థితిలో కుండల్లో, కుళాయిల్లో నిలువ నీటిని ఉంచరాదని వాటిని పారవేయాలని ఆయన కాలనీ ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వస్తాయని, ఇండ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ చోరీ ప్రయత్నం విఫలం




**మెదక్ ఆగస్టు 08 (ప్రజా స్వరం) :**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో దొంగలు చోరీ కి ప్రయత్నించిన సంఘటన మెదక్ లో చోటు చేసుకుంది. శుక్రవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు గోడలు బద్దలు కొట్టి లోపలికి చోర బడేందుకు ప్రయత్నించారు. అయితే తీర దొంగల ప్రయత్నం విఫలమైంది. బ్యాంకు గోడలను వాళ్లు బద్దలు కొట్టలేకపోవడంతో భారీ నష్టం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేసుకుని, క్లూస్ టీంని ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. బ్యాంకు పక్కన ఉన్న భవనం నుంచి దొంగలు కిందకు దిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులు సెలవులు కావడంతో ఈ ఘాతుకానికి ప్రయత్నించారని అనుకుంటున్నారు. సీసీ టీవీ ఫుటేజీ ని పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని సీఐ మహేష్ తెలిపారు.

## ఎస్సీ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

**మెదక్ ఆగస్ట్ 08 (ప్రజా స్వరం) :**



దళిత కాలనీ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం టౌన్ కన్వీనర్ సంతోష్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణం ఒకటవ వార్డు లో సీపీఎం నాయకులు ప్రజల సమస్యలను అడిగి తేలుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణంలో ఉన్న మొదటి వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో మోరీలన్నీ ధ్వంసమైన పరిస్థితి ఉంది వర్షపు మోరీలు సరిగా లేక ఇండ్లలోకి వస్తున్నాయని అన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు సమస్య కూడా ఉందని అన్నారు కాలనీ చుట్టుపక్కల పొదలు ఉండి అక్కడ నివసిస్తున్న ప్రజలకు అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు అజయ్, దుర్గా, యాదగిరి, ఉశయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

**మెదక్ ఆగస్ట్ 08 (ప్రజా స్వరం) :**



పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసిన సంఘటన హవేలీ ఘనపూర్ మండలం శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం కూచన్ పల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి 12 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 17,209 రూపాయల నగదు, 11 సెల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిని హవేలీ ఘనపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించామని కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

# ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ ఆగస్ట్ 08 (ప్రజా స్వరం) :**
ఎరువులు కుత్రిమ కొరత సృష్టించద్దని డిమాండ్ కు అనుగుణంగా నిలువలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. శుక్ర వారం హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రం ను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిమాండ్ కు అనుగుణంగా ఉన్న నిల్వలను పరిశీలించారు. స్టాక్ వివరాలను, ఆన్లైన్ తదితర వివరాలను డీలర్లు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్ కు అనుగుణంగా జిల్లాలో తగినన్ని ఎరువులు విత్తనాలు ఉన్నాయని కొంత మంది కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతులతో స్వయంగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందించారు రైతులు జిల్లాలో ముందస్తుగా ఎరువులు విత్తనాలు యూరియా డిఏపి తదితర ఫర్టిలైజర్స్ లో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచుకోవడం జరిగిందని తెలిపారు. కల్తీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన, ప్రభుత్వం సూచించిన ప్రకారం సంబంధిత వ్యక్తులపై శాఖ పరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు. టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు.

## ఖబర్దార్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి





**మెదక్ ఆగస్టు 08 (ప్రజా స్వరం) :**
జిల్లా పాలనాధికారికి, ఇతర ప్రభుత్వ అధికారులకు నాన్ గెజిటెడ్, గెజిటెడ్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ అండగా ఉందని టిఎన్జీవోస్ అధ్యక్షులు & జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ తెలిపారు. శుక్ర వారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో భోజన విరామ సమయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై నిరసనలు తెలియజేస్తూ టీఎన్జీవోస్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ నాన్ గెజిటెడ్, గెజిటెడ్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ముక్త కంఠంతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిఎన్జీవోస్ అధ్యక్షులు & జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ మాట్లాడుతూ ఈ నెల 7న మెదక్ కలెక్టరేట్ కార్యాలయ ధర్నా చౌక్ వద్ద టిఆర్ఎస్ పార్టీ రైతు ధర్నా లో దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాల పట్ల జవాబుదారితనం పారదర్శకత లక్ష్యంగా మెదక్ జిల్లాలో ప్రగతి పాలన అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ సమిష్టిగా కృషి చేస్తారని అటువంటి సమర్థ వంతమైన పాలన అందిస్తున్న జిల్లా కలెక్టర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని తెలిపారు. ఇక ముందు ఏ ప్రభుత్వ అధికారికైనా అన్యాయం జరిగితే వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారికి అండగా మెదక్ జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ అండగా ఉండటంతో పాటు వారిని రక్షించడం జరుగుతుందన్నారు. రాజకీయాలకతీతంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చిత్త శుద్ధితో ప్రభుత్వ అధికారులు అమలు చేస్తారన్నారు. మెదక్ జిల్లా ప్రభుత్వ అధికారులు విధుల పట్ల చిత్తశుద్ధి అంకితభావంతో పని చేస్తారని తెలిపారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ విఠల్, టీఎన్జీవో సెక్రెటరీ రాజ్ కుమార్, క్లాస్ ఫోర్త్ అధ్యక్ష కార్యదర్శులు జలగం ప్రసాద్, రిజ్వాన్ అలీ, ఎస్ టి యు అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, టిటియు అధ్యక్షులు శివయ్య, టిఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు జంగం నగేష్, గోపాల్, శ్రీ హర్ష ధనుంజయ్, జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు


**శామీర్ పేట, ఆగస్టు 8(ప్రజా స్వరం) :**
శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్ వి ఎల్ ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో ఈనెల 9 నుంచి 12 వరకు శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రాఘవేంద్ర స్వామి 354 వ ఆరాధన మహోత్సవాలు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమౌతున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు ధ్వజరోహణం, గోపూజ, ధాన్యపూజ, 10 న ఆదివారము శ్రీ రాఘవేంద్ర స్వామి పూర్వారాధనలో భాగంగా ఉదయం నిర్మాల్య విసర్జన, ఫలపంచామృత అభిషేకము, పాదపూజ, కనకాభిషేకము, తులసి అర్చన, హస్తోదకం, తీర్థప్రసాద వితరణ జరుగును. సాయంత్రం పల్లకి సేవా, రథోత్సవం, అష్టావధానసేవ, మహా మంగళహరతి. అలాగే 11 న సోమవారము శ్రీ రాఘవేంద్ర స్వామి మధ్యారాధనలో భాగంగా ఉదయం నిర్మాల్య విసర్జన, ఫలపంచామృత అభిషేకము, పాదపూజ, కనకాభిషేకము, తులసి అర్చన,



అలంకార బ్రహ్మణ పాదప్రక్షాళన, హస్తోదకం, తీర్థప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ. సాయంత్రం పల్లకి సేవా, రథోత్సవం, అష్టావధాన సేవ, మహా మంగళహరతి జరగనున్నట్లు చెప్పారు. అలాగే 12 మంగళవారము శ్రీ రాఘవేంద్ర స్వామి ఉత్తరాధనలో భాగంగా ఉదయం నిర్మాల్య విసర్జన, ఫలపంచామృత అభిషేకము, పాదపూజ, కనకాభిషేకము, తులసి అర్చన, కూచిపూడి, భరతనాట్యం జరుగును. హస్తోదకం, పల్లికి సేవా, రథోత్సవం, అష్టావధానసేవ, కూష్మాండ బలి, మహా మంగళహరతి, తీర్థ ప్రసాద వితరణ జరగనున్నట్లు చెప్పారు. ఈ మూడురోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలకి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనని, స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించి స్వామి కృపకు పాత్రలు కాగలరని కోరారు.

## అదనపు కలెక్టర్ తనిఖీలు

**శామీర్ పేట ఆగస్టు 8 (ప్రజా స్వరం) :**
భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్ర వారం భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార దిశలో భాగంగా మూడుచింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి ఆన్ లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు దారులు ఇచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కారమయ్యాయని మూడుచింతలపల్లి తహసిల్దారును అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి అవుతున్న జాప్యానికి గల కారణాలను పరిశీలించారు. సాంకేతిక పరమైన ఏమైన ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే క్లియర్ చేసుకోవాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆన్ లైన్ లో మ్యానువల్ గా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టరు పరిశీలించారు.





## మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల ఆడబిడ్డ జ్యోతి, గిరిజన మహిళలు

**వికారాబాద్, ఆగస్టు 8(ప్రజా స్వరం):**
బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్ల తండాకు చెందిన ఆడబిడ్డ జ్యోతి, గిరిజన మహిళలు శుక్ర వారం తెలంగాణ భవన్ లో రాఖీ కట్టారు. తన భర్తను ప్రభుత్వం అక్రమంగా జైలుకు పంపినప్పుడు కేటీఆర్ అన్న లెక్క నిలబడ్డాడు. గర్భిణిగా ఉన్నప్పుడు నా క్షేమాలన్నీ చూసుకొని, నా బిడ్డకు మేనమామ లెక్క భూమి నాయక్ అని పేరు పెట్టాడు. ఆపదలో నాకు దేవుడు ఇచ్చిన అన్న కేటీఆర్ అని రాఖీ కట్టిన లగచర్ల ఆడబిడ్డ జ్యోతి ఈ సందర్భంగా మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు.

## బస్తీ దవాఖానను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**మెదక్ ఆగస్టు 08 (ప్రజా స్వరం):**
మెదక్ పట్టణం గోల్కొండ వీధి లోని బస్తీ దవాఖానను జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగుల హాజరు నమోదు రిజిస్టర్ రికార్డ్స్ పరిశీలించారు. వైద్య సిబంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట ఏవో డా. హరి ప్రసాద్ ఉన్నారు.



## వికారాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా మంగీలాల్

**వికారాబాద్, ఆగస్ట్ 8(ప్రజా స్వరం):**
జిల్లా రెవెన్యూ అధికారిగా మంగీలాల్ శుక్ర వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదే సందర్భంలో కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను పూల బొకే తో మర్యాదపూర్వకంగా కలిశారు. మంగీలాల్ వరంగల్ హనుమకొండ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేసిన ఆయన వికారాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీపై వచ్చారు.



## జర్నలిస్టు భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి



**వికారాబాద్,ఆగస్టు 8(ప్రజా స్వరం):**
వికారాబాద్ జిల్లా పరిగి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ఎండీ ఆలం సాబ్ శుక్రవారం అనారోగ్యంతో తన ఇంటిలో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా పాత్రికేయ సంఘాల ప్రతినిధులు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. దాదాపు 40 ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో ఉర్దూ చిన్న పత్రిక సంపాదకుడిగా, ఉర్దూ దినపత్రికలకు పాత్రికేయునిగా సీనియర్ జర్నలిస్టు ఆలం పని చేశారు. వికారాబాద్ జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా కూడా ఆయన కొనసాగారు. కాగా ఈ విషాదకర వార్త తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే, వికారాబాద్ జిల్లా డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుమారుడు వాజిద్ ను పరామర్శిస్తూ,కుటుంబానికి మనోబలాన్ని అందించారు.

## కాంగ్రెస్ పార్టీపై కసి తీర్చుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు




**తాండూరు, ఆగస్టు 8 (ప్రజాస్వరం) :**
కాంగ్రెస్ పార్టీపై ఉన్న ఆగ్రహాన్ని ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో చూపెడతారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పి .శ్రీశైల్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని పైలెట్ రోహిత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శుక్ర వారం జరిగిన తాండూరు నియోజకవర్గం పెద్దేముల్, కోటపల్లి మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సాధ్యం కానీ హామీలతో మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేసిన వైనంపై ప్రజలు తీవ్ర కసి మీద ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వారి వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు రోజుకు ఒక డ్రామాలకు తెరలేపుతున్నారు. పైలెట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు సొంతం చేసుకుంటుందన్నారు. మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంమే అని తెలిపారు. ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మోసాన్ని ప్రతి ఇంటికి తిరిగి కార్యకర్తలు ప్రజలకు చెప్పాలి. అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థలు ఎన్నికల్లో మన సత్తా చాటాలి అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పి .శ్రీశైల్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు రమేష్, గోపాల్ రెడ్డి, మహేందర్, అంజయ్య, జనార్దన్ రెడ్డి రాములు, నరేష్ రెడ్డి, సిబ్లీ, శ్రావణ, మండల పార్టీ సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999






# ఆర్థరైటిస్‌కు అదిరిపోయే చిట్కా..

ఈ మధ్యకాలంలో చాలా మందిని ఇబ్బంది పెడుతున్న సమస్య ఆర్థరైటిస్. కీళ్లనొప్పులు, కీళ్ల బలహీనత, కీళ్ల చుట్టూ ఉండే కండరాల నొప్పి, వాపు ఉండటం దీని లక్షణాలు. కాస్తంత ఊబకాయం ఉందంటే వారిలో దీని ప్రభావం మరింత అధికంగా ఉంటుంది. వారి అధికబరువు.. ఆర్థరైటిస్‌కు మరింత బలమైన ఇంధనంలా పనిచేసి నొప్పులను విపరీతం చేస్తుంది. ఆర్థరైటిస్ వచ్చిన వారికి ఎక్కువ శాతం చేతులు, మోకాళ్లు, తుంటి, వెన్నెముక వంటి ప్రదేశాల్లో నొప్పులు వస్తుంటాయి. ఈ ఆర్థరైటిస్‌కు ఆదిలోనే మందు వేస్తే చాలా మంచిదని వైద్యులు కూడా అంటున్నారు. ఆర్థరైటిస్‌కు ఆయుర్వేదంలో అద్భుతమైన చిట్కా ఒకటి ఉందని, అది పాటిస్తే ఆర్థరైటిస్ ఉన్నా లేనట్లే ఉంటుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా ఈ చిట్కా అనేది ఆర్థరైటిస్ నొప్పిని తగ్గించడమే కాకుండా సమస్యను కూడా నయం చేయగలదని చెప్తున్నారు. వీటి కోసం ఎంతో కష్టపడాల్సిన, శ్రమ చేయాల్సిన పని కూడా లేదంటున్నారు. అనేక వ్యాధులకు, రోగాలకు ఆయుర్వేదంలో చిన్నచిన్న చిట్కాలు, వంటగదిలోని పదార్థాలతోనే చికిత్స చెప్తుంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ప్రత్యేక మొక్కలు, ప్రత్యేక పద్ధతి ద్వారా ఔషదాన్ని తయారు చేసుకోవాలని సూచిస్తుంటుంది. అటువంటి చిట్కానే ఒకటి ఆర్థరైటిస్‌కు కూడా ఉంది ఆయుర్వేదంలో. ఆ చిట్కాలో చింత గింజలను ప్రధానంగా వినియోగిస్తారు. చింత గింజలు మన కీళ్ల మధ్య ఉండే లూబ్రికేషన్‌ను గుజ్జు పదార్థాన్ని పెంచడంలో సహాయపడతాయి. దాంతో పాటుగానే చింతగింజల్లో ఉండే టానిన్లు, ఫ్లేవనాయిడ్స్ వంటి మరికొన్ని సమ్మేళనాలు పలు ఇతర సమస్యలను తగ్గించడంలో కూడా కీలకంగా వ్యవహరిస్తాయి. ఇవే లక్షణాలు ఆర్థరైటిస్ సమస్యను కూడా సమసిపోయేలా చేస్తాయి. ప్రతి రోజూ నిర్ణీత మోతాదులో చింతగింజల పొడిని తీసుకుంటే చాలు. రెండు మూడు రోజుల్లోనే ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం పొందొచ్చని అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. దీంతో పాటుగా ఆర్థరైటిస్ నొప్పి ఉన్న ప్రాంతంలో కాపడం పెట్టడం, ఓమెగా3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం కూడా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. యోగా, స్విమ్మింగ్ వంటి కీళ్లను దృఢంగా చేసే వ్యాయామాలు చేయడం కూడా మంచిదేనని నిపుణులు చెప్తున్నారు.








## సీటీ స్కాన్ వల్ల క్యాన్సర్ వస్తుందా?

తరుచూ సీటీ స్కాన్ చేయించుకోవడం వల్ల ప్రమాదమా? అంటే అవుననే అంటున్నాయి తాజా అధ్యయనాలు. సిటీ స్కాన్ ఎక్కువసార్లు చేయించుకోవడం వల్ల పిల్లలు, యువతలో బ్లడ్ క్యాన్సర్ ముప్పు గణనీయంగా పెరుగుతోన్నట్లు ఒక తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. మన శరీరంలో అంతర్గతంగా ఉండే సమస్యలను తెలుసుకునేందుకు ఉపయోగపడే అత్యాధునిక టెక్నాలజీ ఈ సిటీ స్కాన్. కానీ ప్రతి సీటీ స్కాన్ తో చిన్నారులు, యువత బ్లడ్ క్యాన్సర్ బారినపడే ప్రమాదం సుమారు 16 శాతం వరకూ పెరుగుతోందని యూరోపియన్ పీడియాట్రిక్ సిటీకి చెందిన పరిశోధకులు చేసిన రీసెర్చ్ లో వెల్లడైంది.దాదాపు 10 లక్షల మంది రోగులపై వారు చేసిన అధ్యయనంలో సీటీ స్కాన్ల నుంచి వెలువడే రేడియేషన్ చిన్నారులు, యువతను క్యాన్సర్ ముప్పుకు గురి చేస్తోందని తేలింది. సీటీ స్కాన్ల నుంచి వెలువడే రేడియేషన్ మోతాదులకు బ్లడ్ క్యాన్సర్, ముఖ్యంగా లింఫాయిడ్, మైలాయిడ్ బారినపడే ముప్పునకు మధ్య స్పష్టమైన సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. సాధారణంగా సీటీ స్కాన్ లో వెలువడే రేడియేషన్ 10 నుంచి 15 యూనిట్లు అంత ప్రమాదకరం కాదని, అందరూ భావిస్తుంటారు. కానీ అంతకంటే తక్కువ స్థాయిల్లో వెలువడే రేడియేషన్ సైతం ప్రమాదకరమేనని వారు చెబుతున్నారు. ఇపుడు సీటీ స్కాన్ చేయించుకునే ప్రతి వెయ్యి మంది చిన్నారుల్లో రానున్న 12 సంవత్సరాల్లో 1.4 క్యాన్సర్ కేసులు నమోదు అయ్యే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. అలాగని వ్యాధి నిర్ధారణలో, చికిత్స ప్రణాళికలో సీటీ స్కాన్ల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయనే విషయంలో ఎలాంటి వివాదం లేదని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి అత్యవసర సందర్భాల్లో మాత్రమే సీటీ స్కాన్ చేయించాలని, దాని వల్ల రేడియేషన్ కి గురయ్యే ప్రమాదం తకువగా ఉంటుందని పరిశోధకులు సూచిస్తున్నారు.




## వేసవిలో ఇమ్యూనిటీ పెంచే ఆహార పదార్థాలు

ఈ సీజన్ లో ఇమ్యూనిటీ పెంచాలంటే కొన్ని ఆహార పదార్థాలను డైట్ లో చేర్చుకోవాలి అంటున్నారు నిపుణులు. మునక్కాయ, ములగాకు పొడి తప్పనిసరిగా తినాలంటున్నారు. వీటిని తీసుకోవడంవల్ల అనేక ఆరోగ్య సమస్యలు నయమవుతాయని చెబుతున్నారు. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలో పీచు అధికంగా ఉండడంవల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. మునగలోని ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్ యాసిడ్లు యాంటీ ఇన్ఫ్లమేటరీగా పని చేస్తాయి. ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఆర్థరైటిస్, ఎలర్జీలు దరిచేరకుండా ఉంటాయని సూచిస్తున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉండడంవల్ల శరీరాన్ని డీ హైడ్రేషన్ నుంచి కాపాడుతుంది. అలసట, వడదెబ్బ వంటి సమస్యల నుంచి రక్షిస్తుంది.



## భార్యాభర్తల మధ్య ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!

భార్యాభర్తల మధ్య ఒక్కోసారి సరదాగా మాట్లాడుకునే మాటలు... పెద్దవై గొడవలుగా మారుతుంటాయి. జీవితాంతం కలిసి ఉండాల్సిన దంపతులు... ప్రతి చిన్నవిషయానికి గొడవలు పడుతుంటే ఇల్లు నరకంగా మారుతుంది. ఇలాంటప్పుడు వివాదం ముదరకుండా ఇద్దరూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సరదాగా వచ్చినా, మాట తూలినందుకైనా.. ఆ సమస్యను సమస్యగానే చూడండి. తాత్కాలికంగా జరిగిన గొడవకు గతంలో జరిగిన పొరబాట్లతో ముడిపెట్టొద్దు. ముందు కారణం తెలుసుకునే ప్రయత్నం చేయండి. దాన్ని పరిష్కరించుకునే మార్గాలను అన్వేషించండి. పొరబాట్లు అందరి వల్లా జరుగుతాయి. నిజంగా అది దిద్దుకోలేని పొరబాటనే మీరు దూరంగా ఉంటున్నారా? అనేది గమనించుకోండి. అప్పుడే మీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.గొడవకి కారణం ఏదైనా ఇద్దరికీ ఎవరి వాదనలు వారికి ఉంటాయి. కొన్నిసార్లు నిజంగానే అక్కడ తప్పు జరగకపోయినా ఆవేశం, అహం ఇద్దరి మధ్య దూరాన్ని పెంచేస్తుంది. వాదులాటే ఇలా పెరగడానికి ప్రధాన కారణం కావొచ్చు. ఇలాంటప్పుడు మాటకు మాటగా... వెంటనే స్పందించేయక్కర్లేదు. మౌనంగా ఉండండి. లేదంటే, ఆవేశంలో అనే మాటలు సమస్యను మరింత పెద్దవిగా మారుస్తాయి. ఒకవేళ ఒక మాట పడినా తప్పేం లేదు... కాస్త వేడి చల్లారాక మీ అభిప్రాయాన్ని అవతలివారికి అర్థమయ్యేలా చెప్పి చూడండి. అర్థం చేసుకుంటారు.



# అలాంటి పాత్రలు ఇస్తేనే సినిమాలు చేస్తా..



## ఆశిష్ విద్యార్థి కామెంట్స్

స్టార్ యాక్టర్ ఆశిష్ విద్యార్థికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. దాదాపు అన్ని భాషల్లో ఆయన సినిమాలు చేశారు. 30 ఏళ్ల కెరీర్ లో 300లకు పైగా సినిమాల్లో నటించారు. తెలుగులో స్టార్ హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు చేస్తూ ఫేమస్ అయ్యారు. రీసెంట్ గా ఆయన సినిమాలు తగ్గించేశారు. ఎక్కడా కనిపించట్లేదు. దీంతో ఏమైందా అని ఆయన ఫ్యాన్స్ ఆరా తీస్తున్నారు. తాజాగా ఆయన ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. నేను ఎందుకు సినిమాలు చేయట్లేదో అని చాలా మంది అడుగుతున్నారు. వారికి క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది. నేను ఇప్పుడు సినిమాలు చేయకపోయినా గ్రేట్ యాక్టర్ నే. 300లకు పైగా సినిమాల్లో నటించాను. ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో చేశాను. కానీ ఇప్పుడు బోర్ కొడుతోంది. రెగ్యులర్ గా చిన్న పాత్రలే వస్తున్నాయి.అందుకే చేయట్లేదు. ఇంపార్టెంట్ పాత్రలు వస్తేనే చేస్తానని ఇప్పటికే డైరెక్టర్లకు చెప్పాను. సినిమాల్లో కీలక పాత్రలు మాత్రమే చేయాలని నిర్ణయించుకున్నాను. అందుకే చిన్న పాత్రల్లో నటించట్లేదు. రొటీన్ పాత్రలు చేయాలని అనుకోవట్లేదు. మనం కొత్తగా చేసినప్పుడే ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. నా కెరీర్ నిలబడటానికి కారణం కూడా అదే. ఈ నడుమ అన్నీ తేలికపాటి పాత్రలే వస్తుండటంతో రిజెక్ట్ చేస్తున్నా. ఒకవేళ కీలక పాత్రలు రాకపోతే సినిమాలు మానేస్తా. అంతేగానీ చిన్న పాత్రలు చేయను అంటూ తేల్చి చెప్పారు ఆశిష్. రీసెంట్ గానే ఆయన పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.



# గర్భవతిని అని చెప్పిన వినకుండా.. ఆ నిర్మాత చాలా ఇబ్బంది పెట్టారు

టాలీవుడ్‌లో రక్త చరిత్ర సినిమాతో ఎంట్రీ ఇచ్చిన నటి రాధికా ఆప్టే, లెజెండ్ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాలకు దగ్గరయ్యారు. 2015లో వచ్చిన లయన్ తర్వాత టాలీవుడ్‌కు దూరంగా ఉన్న రాధికా, బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో బిజీగా మారింది. 2012లో బ్రిటిష్ సంగీత దర్శకుడు బెనెడిక్ట్ టేలర్‌ను ప్రేమించి పెళ్లాడిన ఆమె, పెళ్లయి పది సంవత్సరాల తర్వాతే తల్లయిన విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో రాధికా బిడ్డకు జన్మనిచ్చింది. అయితే టాలెంట్‌తో పాటు తన నిజాయితీ గల వ్యాఖ్యలతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే నటి రాధిక ఆప్టే, ఇటీవల ఒక చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ఇటీవల నేహా ధూపియా నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొన్న రాధికా.. 'ప్రెగ్నెంట్ అయిన మొదటి మూడు నెలలు నాకు నరకంలా అనిపించాయి. శారీరకంగా-మానసికంగా చాలా బాధ పడ్డాను, అందులోను ఓ సినిమా కారణంగా చాలా ఇబ్బందులు కూడా ఎదురుకున్నాను. ఆ సమయంలో నేను బిగుతైన దుస్తులు ధరించకూడదని చెప్పినా, నిర్మాత పట్టుబట్టాడు. బాగా తినడం వల్ల నా శరీరంలో మార్పులు వచ్చాయి, కానీ నా పరిస్థితిని అర్థం చేసుకోలేదు. షూటింగ్ సెట్‌లో నొప్పితో ఉన్నా వైద్యుడిని కలిసేందుకు కూడా అనుమతించలేదు. ఇది నాకు చాలా బాధ కలిగించిన విషయం. నేను వృత్తి పరంగా ఎప్పుడూ నిజాయితీగా ఉంటాను, కానీ ఇలాంటి సమయంలో కొంత మానవత్వం, సానుభూతి అవసరమని రాధికా స్పష్టం చేశారు' ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# "కర్వీ అంటే బలహీనత కాదు"

ఇండస్ట్రీలో ఎవ్వరి అదృష్టం ఎప్పుడు ఎలా వరిస్తుందో చెప్పలేము. అందులోను బుల్లి తెర నుండి వెండితేపరపై స్టార్ అవ్వడం అంత ఈజీ కాదు. అందులో మృణాల్ ఒకరు. హింది సిరియల్స్ ద్వారా తెరపై ఎంట్రీ ఇచ్చిన మృణాల్ ఠాకూర్ బాలీవుడ్ సినిమాలో ఎంట్రీ ఇచ్చి .. తర్వాత టాలీవుడ్ లో 'సీతరామం' తో మరింత గుర్తింపు సంపాదించుకుంది. అయితే సినిమా ఇండస్ట్రీలో శరీరాకృతి గురించి కామెంట్లు కొత్తేమీ కావు. కానీ, వాటికి జవాబు చెప్పడానికి మృణాల్ ఠాకూర్ తీసుకున్న స్టాండ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "కర్వీ" అనిపించుకోవడం బలహీనత కాదని, అది ఒక అందమైన సహజ స్వరూపమని ఆమె చెబుతున్నారు.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో భాగంగా 'కర్వీగా ఉండటం అంటే సోమరితనం కాదు, ప్రజలు ఈ తేడాను అర్థం చేసుకోవాలి. నేను ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తా, వ్యాయామానికి మద్దతు ఇస్తా. కానీ అదే సమయంలో, మనం మన చర్మం ఆరోగ్యంగా ఉండటం కూడా చాలా ముఖ్యం. దాని కోసం సరైన నిద్ర.. మంచి ఫుడ్ కచ్చితంగా తీసుకుంటా. అలాగే కొన్ని పాత్రల కోసం బరువు పెరుగుతా, కొన్ని పాత్రల కోసం తగ్గుతా. ఇది నా పనిలో భాగం. ప్రతిసారీ ఈ మార్పులను ప్రజలకు వివరిస్తూ ఉండాల్సిన అవసరం లేదు. నా పాత్రలో నేను ఎలా నటిస్తున్నాననే విషయమే నాకు ముఖ్యం' అని మృణాల్ స్పష్టం చేశారు. ఇవాల రేపు శరీర ఆకృతి కోసం కడుపు కట్టుకుంటున్న ఈ కాలంలో.. "రూపం కంటే ఆరోగ్యం, ఆనందం ముఖ్యం" అని చెబుతూ, ఇతరులకు ఆత్మవిశ్వాసం పెంచేలా మాట్లాడింది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ పరంగా చూస్తే, మృణాల్ ఠాకూర్ తదుపరి చిత్రం 'డకోయిట్' లో అడివి శేష్ సరసన నటిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది.

# నాని 'ప్యారడైజ్' నుంచి సెకండ్ పోస్టర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను మరింత పెంచుతూ, చిత్రబృందం శుక్రవారం సాయంత్రం నాని రెండో పోస్టర్‌ను విడుదల చేసింది. 'జడల్' అనే పాత్రలో నాని కనిపిస్తున్న ఈ పోస్టర్, ఆయన యాటిట్యూడ్‌ను స్పష్టంగా చూపిస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌ను నాని తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ, "వాడి తీరు. నేను ఒక్క అంగుళం కూడా కదలను. యుద్ధాన్ని నా వద్దకు తీసుకురండి. ఎదురుచూస్తున్నా" అని రాసుకొచ్చారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా పోస్టర్‌ను షేర్ చేస్తూ, "నా జడల్. వాడి యాటిట్యూడ్. ప్రపంచం అతనికి వ్యతిరేకంగా ఉండొచ్చు, అంతమైపోవచ్చు. కానీ వాటన్నింటినీ ఒంటరిగానే ఎదుర్కొంటాడు. మునుపెన్నడూ లేని విధంగా ఎదుగుతాడు" అని పేర్కొన్నారు. ఈ క్యాప్షన్లు సినిమాలోని పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. అందులో భాగంగానే శుక్రవారం ఉదయం ఒక పోస్టర్, సాయంత్రం రెండో పోస్టర్‌ను విడుదల చేసి అభిమానులను ఆశ్చర్యపరిచారు. "అందరిలో ప్రత్యేకంగా నిలవాలనుకున్నాడు. అందుకే సింహాసనంపై కూర్చోవాలని నిర్ణయించుకున్నాడు. మా నేచురల్ స్టార్ నాని బాక్సాఫీస్‌ను ఏలుతాడు" అని నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వి సినిమాస్ ధీమా వ్యక్తం చేసింది. నాని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఇటీవలే ఫైట్ మాస్టర్ రియల్ సతీష్ పర్యవేక్షణలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించారు. ఈ సన్నివేశం కోసం విదేశీ స్టంట్ మాస్టర్లు కూడా పనిచేశారని, ఇది సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ప్రముఖ హిందీ నటుడు, 'కిల్' ఫేమ్ రాఘవ్ జుయల్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ సహా మొత్తం ఎనిమిది భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999